క్లుప్తంగా

ఎమ్మెల్యే గణేష్ దంపతుల ప్రత్యేక పూజలు

నర్సీపట్నం : విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, కళావతి దంపతులు శుక్రవారం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే దంపతులు పసుపు, కుంకుమలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

పాయకరావుపేటలో ఒక నామినేషన్ తిరస్కరణ

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి మొత్తం 11 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ఒక అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్టు రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కంబాల సందీప్ నామినేషన్ పత్రాల్లో ఫారం బిని సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరించామన్నారు. మిగిలిన 10 మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లన్నీ సక్రమంగానే ఉన్నాయని వాటిని ఆమోదించడం జరిగిందన్నారు.

నర్సీపట్నంలో రెండు..

నర్సీపట్నం : నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, వీరిలో స్క్రూటినీలో ఇద్దరి నామినేషన్లు తిరస్కరించామని అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం తెలిపారు. ప్రధాన పార్టీలు టీడీపీకి చెందిన చింతకాయల రాజేష్, వైఎస్సార్‌సీపీకి చెందిన పెట్ల కళావతి నామినేషన్లు తిరస్కరించామని తెలిపారు. ప్రధాన పార్టీల మెయిన్ అభ్యర్థులు వైఎస్సార్‌సీపీ పెట్ల ఉమాశంకర్ గణేష్, టీడీపీ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కాంగ్రెస్ పార్టీ రుత్తల శ్రీరామ్మూర్తి, బీఎస్పీ బొట్టా నాగరాజుతో పాటు ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు, రిజిస్టర్డ్ పార్టీకి చెందిన ఇద్దరు మొత్తం 8 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని రిటర్నింగ్ అధికారి తెలిపారు.


హాస్టళ్లలో టెన్త్ టాపర్లకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరావు తదితరులు

ఎస్.రాయవరం : వసతి గృహాల్లో విద్యార్థులు మరిన్ని మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులకు పునాదులు వేసుకోవాలని బీసీ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరావు అన్నారు. రేవుపాలవరం బీసీ బాలికల వసతి గృహంలో 5 వందలకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. 550 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన చోడిపల్లి అనూష, 525 మార్కులు సాధించి ద్వితీయ సాధించి మైలపల్లి వసంత, 520 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన సూరాడ కృష్ణవేణిలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. గడిచిన 9 ఏళ్లలో ఈ వసతి గృహంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులుగా అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, వార్డెన్లు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తు ప్రణాళిక



సీఆర్పీలకు సూచనలు చేస్తున్న ఎంఈవో-2 వరహాలబాబు

నాతవరం : వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఆయన శుక్రవారం సమగ్ర శిక్షా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2024-2025 విద్యా సంవత్సరానికి కావలసిన మెటీరియల్ వనరులు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, విద్యార్థుల వివరాలతో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సామాగ్రి పై చర్చించారు.

పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తా...

- నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉంది
- పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు, వలసల నివారణకు ప్రాధాన్యం
- పూర్తి స్థాయిలో సాగునీటి వనరుల అభివృద్ధి
- సాక్షితో పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు

సాక్షి ఇంటర్వ్యూ



నక్కపల్లి: గత ఎన్నికల ముందు మా పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని 98 శాతం నెరవేర్చడం జరిగిందని, ఏమైనా సాంకేతిక, పరిపాలనా కారణాల వల్ల కొన్ని నెరవేరకపోతే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు తెలిపారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా రాజాం ఎమ్మెల్యేగా ఉన్న ఆయన పాయరావుపేటలో వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగారు. ఈ సందర్భంగా సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూ...

సాక్షి: నియోజకవర్గానికి మీరు కొత్త కదా.. ఇక్కడ సమస్యలపై అవగాహన ఉందా?

కంబాల జోగులు : ఇక్కడ సమన్వయకర్తగా నియమితులై దాదాపు నాలుగు నెలలు పూర్తయింది. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటించాను. మా పార్టీలో సమర్థులైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వారి ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ ఐదేళ్ల పాలనలో మా ప్రభుత్వం 90 శాతం సమస్యలు పరిష్కరించారు. ప్రతి గడపలోను లబ్ధి కలిగింది. వాటిని కొనసాగిస్తూ ఇంకా చేయాల్సిన అభివృద్ధిపై దృష్టి పెడతాను.

సాగుపై ఆధారపడిన వారికి మీరు ఇచ్చే భరోసా?

నియోజకవర్గ రైతులకు చిరకాల వాంఛ అయిన 35 క్యూసెక్కుల తాండవ జలాలు దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే విడుదల చేయడం జరిగింది. ఈ 20 ఏళ్ల నుంచి ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతోంది. గతంలో 20 ఏళ్లు పాలించిన టీడీపీ ఏనాడూ ఈ సమస్య పరిష్కరించలేదు. సాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకువస్తాను. తాండవ, వరహానదుల ఆయకట్టు ప్రాంతాల్లో సాగునీరు అందించే కాలువలు, గ్రోయిన్‌లను రిపేర్లు చేయించి నీటి కష్టాలు తీర్చేందుకు ప్రయత్నిస్తా. మా ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలు అనకాపల్లి ఎంపీ నిధులు విడుదల చేసి భూమి, ముఠా, ఆవ కాలువలను మరమ్మతులు చేపట్టడం జరిగింది. ఈ ప్రాంతంలో పండించే తమలపాకు, జీడిమామిడి పంటలతో పాటు కూరగాయలకు కూడా గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నం చేస్తా.

వలసల నివారణకు మీరు తీసుకునే చర్యలు?

మత్స్యకారులు, యాదవులతోపాటు, ఇతర సామాజిక వర్గాల నుంచి ఎక్కువగా వలసలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా వీలైనంత మందికి ఎక్కువ పనికల్పించి వలసల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నియోజకవర్గానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫిష్‌లాండింగ్ సెంటరు మంజూరు చేశారు. నిధులు కూడా విడుదలయ్యాయి. స్థల పరిశీలనలోఉంది. ఎన్నికల అనంతరం నిర్మాణపు పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గంలో 17 మత్స్యకార గ్రామాల్లో ఉన్న 25వేల మంది మత్స్యకారులకు ఉపాధి, మార్కెటింగ్ సదుపాయం కలుగుతుంది. ఇండస్ట్రియల్ కారిడార్‌లో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వాళ్లకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకుంటాం.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదనే విమర్శలు?

నియోజకవర్గంలో హెటిరో, డక్కన్ కంపెనీలు ఉన్నాయి. ఈ పరిశ్రమలు దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే ఏర్పాటయ్యాయి. కంపెనీల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలనే చట్టాన్ని జగనన్న ప్రభుత్వం రూపొందించింది. కంపెనీ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి ఇప్పటి వరకు స్థానికులకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చేరనే డేటా సేకరించి ఇవ్వబోయే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కానుంది. అక్కడ ఏర్పాటయ్యే కంపెనీల్లో కూడా స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

యువత కోసం మీరు ఇచ్చే భరోసా ఏంటి?

నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తా. స్థానిక కంపెనీల్లో అవసరమైన సాంకేతిక శిక్షణ ఇప్పించడంతో పాటు ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. ఇకపై ఈ ప్రాంతంలో నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు ఉద్యోగాల కోసం వలస వెళ్లే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటాం.

నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటరు అవసరం ఉంది

ఈ ప్రతిపాదన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్దకు మా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎంపీ సత్యవతి ఇప్పటికే తీసుకెళ్లారు. ఈ ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచి రూ.6 కోట్లతో ఆధునిక భవనాలు నిర్మించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. ట్రామా కేర్ సెంటరు కూడా ఏర్పాటు చేసి అత్యవసర చికిత్స అందించేందుకు కృషి చేస్తాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పాయకరావుపేట, ఎస్.రాయవరంలలో రూ.4 కోట్లతో పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించడం జరిగింది. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే వైద్య సిబ్బంది వెళ్లి సేవలు అందిస్తున్నారు.

డిగ్రీ కళాశాలకు ఇంకా భవనాలు నిర్మించలేదనే విమర్శ ఉంది..

నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన నక్కపల్లి డిగ్రీ కళాశాలను మంజూరు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో మా ప్రభుత్వంలో నెరవేర్చాం. మూడేళ్ల నుంచి తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మిస్తాం. నాడు నేడు పథకం ద్వారా రూ.132 కోట్లు వెచ్చింది 152 పాఠశాలల్లో కార్పొరేట్ సదుపాయాలు మౌలిక వసతులు కల్పించడం జరిగింది. విద్య, వైద్య రంగాలకు జగనన్న ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ రంగాల గురించి మాట్లాడే అర్హత ఎవరికీ లేదు.

జి.నగరంలో హీరో సాయిరాం శంకర్ ప్రచారం



జి.నగరంలో ప్రచారం చేస్తున్న సాయిరాంశంకర్

మాకవరపాలెం : వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అంతా కృషి చేయాలని సినీ హీరో, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సోదరుడు సాయిరాంశంకర్ కోరారు. మండలంలోని జి.వెంకటాపురం శివారు జి.నగరంలో శుక్రవారం రాత్రి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు గంగరాజు, గాంధీ, దాట్ల శ్రీనురాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుడాల కళ్యాణంతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సాయిరాంశంకర్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలుకుతూ అడుగడుగునా హారతులు పట్టారు. ప్రభుత్వం చేపట్టిన అభివృది పనుల వివరాలతో ముద్రించిన పత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. అనంతరం సాయిరాంశంకర్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి మరలా వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యేగా గణేష్‌ను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నా రు. ఈ ప్రచారంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయ ణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, మండల సాస్కృతిక విభా గం అధ్యక్షుడు జె.కె.రాజు, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు

సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో హెచ్చరిక



గుమ్మడిగొండ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: సచివాలయ ఉద్యోగులు విధిగా సమయ పాలన పాటించాలని లేకుంటే చర్యలు ఉంటాయని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. ఆయన శుక్రవారం గుమ్మడిగొండ నాతవరం సచివాలయాలను ఆకస్మాకంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించగా కొంతమంది సిబ్బంది హాజరు రిజిష్టరులో సంతకాలు పెట్టకపోవడం, కొందరు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా వెళ్లిపోవడం గుర్తించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటు చేస్తే ఇక్కడ పని చేసే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చూపడం ఏమిటని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులు పట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిబంధనలు ప్రకారం వ్యవహరించాలని, లేకుంటే మీపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాధ్యతగా విధులు నిర్వహించడంతో పాటు ఎన్నికల కోడ్ అమలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. తర్వాత అయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి. మూర్తి, నాతవరం గుమ్మడిగొండ పంచాయతీ కార్యదర్శులు శ్రీను చినబాబు సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలు నూరు శాతం అమలు చేశాం



కొత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న చిక్కాల రామారావు, కంబాల సందీప్, లంక సూరిబాబు



పట్టణంలో గుంటపల్లి కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న దగ్గుపల్లి సాయిబాబు, నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలైన నవరత్నాలు నూరు శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, జెడ్పీటీసీ లంక సూరిబాబు అన్నారు. మండలంలో గల కొత్తూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిరువురు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతి కొనసాగాలన్నా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ ఎన్నుకోవాలన్నారు. వెలమకాలనీ, వైజంక్షన్ ఏరియాల్లో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పంచాయితీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమం



చినసర్పాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

పాయకరావుపేట : మే 13 న జరగబోయే ఎన్నికల్లో ఓటర్లు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి మళ్లీ జగనన్న ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. ఆయన మండలంలో గల చిన సర్పాపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యేగా కంబాల జోగులుని, ఎంపీగా బూడి ముత్యాల నాయుడిని గెలిపించుకోవాలన్నారు. ఈయనతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ సూరిబాబు, మాజీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధి రామకృష్ణ, ఎంపీటీసీ నరేష్, ఏఎంసీ డైరెక్టర్ పెనుమత్య నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి వీల్‌చైర్

- మండలంలో 85 ఏళ్లు దాటినవారు 33, దివ్యాంగులు 84 మంది
- తహసీల్దార్ రమేష్‌కుమార్ వెల్లడి



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో సిబ్బందితో పోలింగ్ కేంద్రాలు వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అయా కేంద్రాలలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 33 , దివ్యాంగులు 84 మంది మొత్తం కలిపి 117మంది ఉన్నారన్నా రు. వారందరికి ఎన్నికలు కమిషనర్ ఆదేశాల మేరకు ఓటు వేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మండల వ్యాప్తంగా 51,476 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్‌కు 65 వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఓటమి భయంతోనే అయ్యన్న గిమ్మిక్కులు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



కరపత్రం అందజేసి ఓటు వేయమని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : ఓటమి భయంతో అయ్యన్నపాత్రుడు గిమ్మిక్కులు చేస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మండిపడ్డారు. టీడీపీకి చెందిన పి.గణేష్‌తో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయించారన్నారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా మరోసారి అయ్యన్నపాత్రుడుకు ఓటమి తప్పదన్నారు. మున్సిపాలిటీ 13వ వార్డు పెదబొడ్డేపల్లిలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చేసిన అభ్యర్థి వివరించి ఓటు వేయాలని వార్డు ప్రజలను అభ్యర్థించారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో మేనిఫెస్టో విడుదల అవుతుందన్నారు. అయ్యన్నపాత్రుడుకు ఓటమి భయం పట్టుకోవడంతో అదే పార్టీకి చెందిన పైల సూర్య గణేష్‌తో నామినేషన్ వేయించారన్నారు. నా ఓట్లను చీల్చే దురాలోచనతో ఆ వ్యక్తి నామినేషన్ వేయించారన్నారు. అయ్యన్నపాత్రుడు చిల్లర రాజకీయాలు ఎన్ని చేసినా ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో 30 వేల ఓటర్ల మెజార్టీతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. మహాకూటమిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి మంచి చేశాం కాబట్టే ఇంటింటికి వెళ్లి ఓటు వేయమని అడుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ రహితంగా అందరికీ సంక్షేమ ఫలాలు

గొలుగొండ: పార్టీలను, వర్గాలను చూడకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా పార్టీకి ఓటు వేయలేదని అర్హులకు అన్యాయం చేయలేదన్నారు. ఇచ్చిన మ్యానిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్‌గా భావించి పథకాలు అమలు చేశామన్నారు. ఆయన శుక్రవారం నాగాపురం, కొండసింగి, పాత కృష్ణాదేవిపేట, లింగంపేట, ఏఎల్ పురంలో ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసి మరోసారి ఓట్లు అడిగేందుకు వస్తున్నామన్నారు. ప్రజలు ఆశీర్వదించి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేయాలని కోరారు. ఆరిలోవలో రహదారిని అభివృద్ధి చేశామన్నారు. వారంలో అక్కడ బీటీ రోడ్డును పూర్తి చేస్తారన్నారు. దీని మూలంగా వాహనచోదకులకు ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇష్టానుసారంగా కించపరిచి ఇప్పుడు వారి మెప్పు పొందేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వాటిని తిప్పి కొడతామన్నారు. ఒక్క జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేక టీడీపీ, బీజేపీ, జనసేనలు కలిసి పోటీలు చేస్తున్నాయన్నారు. ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న అభిమానం ఓట్లు రూపంలో జగనన్నను మరోసారి సీఎంగా చేస్తుందన్నారు. కూటమిని ఓటర్లు కుదేలు చేస్తారని చెప్పారు. ప్రచారంలో దీనిలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయల కన్వినర్ పాని శాంతరామ్, సర్పంచ్‌లు రఘురామ్, సత్యనారాయణ,సుజాత, సంతోష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్



నాగాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్, ఇతర నేతలు



ఏఎల్‌పురంలో భారీగా తరలి వచ్చిన జనం

హామీలన్నీ నెరవేర్చాం... ఆశీర్వదించండి..

- ప్రతి వాడలో అభివృద్ధి, ప్రతి ఇంటా సంక్షేమం మా ప్రభుత్వ ఘనతే
- ఓటడిగే హక్కు మాకే ఉంది...
- ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

నక్కపల్లి : అభివృద్ధి సంక్షేమాన్ని సమానంగా చేసి చూపించిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం వల్లే ఇప్పుడు ధైర్యంగా మీ ముందుకు ఓటు అడిగేందుకు రాగలుగుతున్నామని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. శుక్రవారం ఆయన జానకయ్యపేట, సిహెచ్.ఎల్.పురం చందనాడ, బుచ్చిరాజుపేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు తీన్మార్ డప్పులతో గ్రామాల్లో ప్రతి వీధిలోకి తీసుకెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలను తీర్చడం జరిగిందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. ప్రతి గ్రామంలో సగటున 100 నుంచి 150 మంది ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించడం జరిగిందన్నారు. 60 ఏళ్లు దాటిన అవ్వాతాతలకు పింఛన్లు మంజూరు చేశామన్నారు. నాడు నేడు కింద పాఠశాలల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పేద విద్యార్థి చదువుకునే పాఠశాలలను కార్పొరేట్ స్థాయి పాఠశాలలుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన ఉన్నత చదువుల కోసం విశాఖ, అనకాపల్లి పట్టణాలకు వెళ్లే ఇబ్బందులను తొలగించామన్నారు. ఆస్పత్రుల స్థాయి పెంచి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా ఇంటింటికి వైద్య సిబ్బంది వచ్చి ఆరోగ్య పరిస్థితి ప్రతి నెలా తెలుసుకునే ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోనే వైద్యనిపుణులను తీసుకువచ్చి ఏడు రకాల వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నిత్యావసర సరుకుల కోసం రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడే పనిలేకుండా ఇంటికి తెచ్చి సరుకులు ఇచ్చే కార్యక్రమం జగనన్న చేపట్టారన్నారు. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ద్వారా దాదాపు 500 రకాల పనులు గ్రామాల్లోనే గంటల వ్యవధిలో జరిగేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కరోనా సంక్షోభంలో కనిపించని వారంతా ఇప్పుడు ఓట్ల కోసం గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. వారు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారో ప్రజలే నిలదీయాలని కోరారు. గతంలో వారిచ్చిన హామీలను మా ప్రభుత్వ హయాంలోనే నెరవేర్చామన్నారు. వచ్చే నెల 13న జరిగే పోలింగ్ నాడు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ కర్రి రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, పార్టీ జేసీఎస్ కన్వీనర్లు సూరాకాసుల గోవిందు, నల్లల రామకృష్ణ సీనియర్ నాయకులు బొల్లం బాబ్జి, శేషారత్నం, గొర్ల బాబూరావు, బంగార్రాజు, ముసలయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.



సిహెచ్‌ఎల్.పురంలో ఓటు అభ్యర్థిస్తున్న అభ్యర్థి జోగులు

ముగిసిన పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ శుక్రవారంతో ముగిసినట్టు పీఆర్‌టీయు నాయకులు శ్రీనివాస్ తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత కోచింగ్‌తో పలువురు విద్యార్థులు 27న పరీక్షకు హాజరవుతున్నట్టు చెప్పారు. ఉచిత కోచింగ్ నిర్వహణకు సహకరించిన దాతలను, గెస్ట్ కోచింగ్ టీచర్లను పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా హాల్ టిక్కెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రచార హోరు... ఫ్యాన్ జోరు



వమ్మవరంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ తదితరులు



కొరుప్రోలులో ప్రచారం నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు

ఎస్.రాయవరం : పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్లలో చేకూర్చిన లబ్ధిని వివరించి ఓటు అభ్యర్థించారు. కొరుప్రోలు, వమ్మవరం, తిమ్మాపురం, గుడివాడ గ్రామాల్లో ప్రచారం జోరుగా కొనసాగించారు. ప్రచారంలో వమ్మవరం, గుడివాడ సర్పంచ్‌లు పాలపర్తి పాపారావు, దూళి శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ, చేకూరి శ్రీరామచంద్రరాజు, పేరిచర్ల శ్రీపతిరాజు, కోరెడ్డి సుబ్బారావు,కోరా జగదీష్, కొంగర రాజు, వమ్మవరం ఎంపీటీసీ సూరిబాబు పాల్గొన్నారు.